క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలో ప్రసిద్ధి చెందిన బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈఓ ఎం.అరుణ్ కుమార్, పాలక వర్గ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా మహా సుదర్శన హోమం



సుంకరపాలెంలో జరిగిన మహా సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: విశ్వ హిందూ పరిషత్ యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో గుంపర్రు పంచాయతీ సుంకరపాలెం గ్రామంలో ఆదివారం హిందూ ధర్మ పరిరక్షణార్థం మహా సుదర్శన హోమం నిర్వహించారు. ఈ హోమానికి నారాయణం మణికంఠ అజయ్ ఆచార్యులు బ్రహ్మత్వం వహించారు. అనంతరం విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సమావేశం నిర్వహించారు. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడుల గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి సోమవారం ఉదయం 10 గంటలకు భీమవరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలని సమావేశంలో తీర్మానించారు.

మార్టేరు మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి మృతి



వీర రాఘవరెడ్డి (ఫైల్)

పెనుమంట్ర: మార్టేరు గ్రామ మాజీ సర్పంచ్ కోణాల వీర రాఘవరెడ్డి (82) ఆదివారం మృతి చెందారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా అనేక సీసీ రోడ్లు నిర్మించడమే కాకుండా మంచినీటి సరఫరాకు ప్రధాన వాటర్ ట్యాంకు నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం తెలిపారు.

గోదావరి గట్టుపై రెయిలింగ్ ధ్వంసం

నరసాపురం: పట్టణంలో గోదావరిగట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధంసమైంది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో గట్టు వెంబడి రెయిలింగ్ నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధంసమైంది. గట్టు వెంబడి నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైంది. కొంతమేర రెయిలింగ్ చోరీకి కూడా గురవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గోదావరి గట్టు వెంబడి రెయిలింగ్ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు, మాముడూరు, ఆలమూరు గ్రామాల్లో ఈ నెల 30న ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నరసాపురం ఎలక్ట్రికల్ ఏఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశఋరు. మూడు గ్రామాల్లో మరమ్మతుల నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మానవత సేవల విస్తరణ



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు డాక్టర్ విజయరాజు

పెనుగొండ: మండలంలో మానవత సేవలు మరింత విస్తరింపజేయనున్నట్లు మండల అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు అన్నారు. ఆదివారం పెనుగొండలో మానవత సమావేశం నిర్వహించారు. మానవతకు నూతన కార్యాలయం నిర్మించనున్నట్లు వివరించారు. దాతలు సహకారం, సభ్యత్వాల సంఖ్య పెంచడం ద్వారా సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సభ్యుడు కర్రి నరేంద్ర రెడ్డి, డైరక్టరు కొప్పిశెట్టి సూర్యనారాయణ కార్యదర్శి షేక్ మస్తాన్, కోశాధికారి యలమర్తి నరసింహరావు, సలహా సంఘ సభ్యులు తానేటి దివాకర్, వసంత్‌కుమార్, మనస్వి పాల్గొన్నారు.

నయనానందకరం..కైలాసవనం



లక్ష్మీపాలెం వద్ద గోదావరి ఒడ్డున సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కైలాసవనం

యలమంచిలి: ప్రతి మనిషీ తన జీవితకాలంలో ఎన్ని మజిలీలు చేసిన చివరి మజిలీ మాత్రం కైలాసవనానికే. అటువంటి కైలాసవనాలు ఏ గ్రామంలో చూసినా చెత్త, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తాయి. ఆధునిక యుగంలో నగరాలు, పట్టణాలలో కైలాసవనాలను ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతున్నారు. అలాంటి అరుదైన కైలాసవనాన్ని పంచ గ్రామాలు లక్ష్మీపాలెం, మట్లపాలెం, నారినమెరక, వడ్డిలంక, గంగడుపాలెం గ్రామాల ప్రజలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ఔరా అనిపించారు.

సొంత ఖర్చులతో నిర్మాణం

ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా కేవలం దాతల సహకారంతో రూ.30 లక్షలు వెచ్చించి లక్ష్మీపాలెం గ్రామంలో వశిష్ఠ గోదావరి నది ఒడ్డున సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కైలాసవనం ఇటీవల ప్రారంభమైంది ఈ నిర్మాణానికి పంచ గ్రామాల్లోని ప్రజలు రూ.500 నుంచి రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించారు. ఈ ప్రదేశంలో గోదావరి తూర్పు నుంచి పశ్చిమ దిశగా పయనిస్తుండటతో పశ్చిమ వాహినిగా పేరు. దక్షిణ కాశీగా పేరు రావడంతో గతం నుంచీ లక్ష్మీపాలెం మునులకు, రుషులకు ఆవాసంగా ఉండేది. ఈ గ్రామంలో ప్రసిద్ధ శివాలయం, రామాలయం, వినాయకుని గుడి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఒకే ప్రాంగణంలో ఉంటాయి. ఈ ఆలయాలకు దగ్గరలోనే గుహ ఉంది. ఈ గుహ నుంచి అంతర్వేది క్షేత్రానికి ప్రత్యేక దారి ఉందని, ఈ గుహలో పూర్వం మునులు తపస్సు చేసుకుని అంతర్వేది వరకు వెళ్లి వచ్చే వారని చెబుతారు. అటువంటి పుణ్య ప్రదేశం కావడం, వశిష్ఠ గోదావరి నది ఒడ్డునే ఉండుటతో పరిసర గ్రామాల ప్రజలంతా చనిపోయిన వారిని తమ గ్రామంలో దహనం చేసిన అస్థికలు మాత్రం లక్ష్మీపాలెం తీసుకువచ్చి గోదావరిలో కలుపుతుంటారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న ఈ శ్మశానవాటిక దగ్గరకు రావడానికి సరైన రోడ్డు, వసతులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో మేడపాడు గ్రామంలో శ్మశానవాటికను అభివృద్ధి చేయడంతో దానిని చూసిన పంచ గ్రామాల ప్రజలు లక్ష్మీపాలెంలో కూడా పూర్తి వసతులతో శ్మశానవాటిక నిర్మించాలని పూనుకున్నారు. అనుకున్నదే తడవుగా దాతలు సహకారం కోరడంతో అంచలంచెలుగా సుమారు రూ.30 లక్షలు విరాళాలు వచ్చాయి. దీంతో ప్రభుత్వ నిధుల అవసరం లేకుండా కై లాసవనం పేరిట శ్మశానవాటికను నిర్మించారు.

ఆకట్టుకుంటున్న వసతులు

ప్రధాన గ్రామం నుంచి కైలాసవనం వరకు సిమెంట్ రోడ్డు ఉంది. కైలాసవనంలో మూడు పొయ్యిలు (బర్నర్స్) ఏర్పాటు చేశారు. రెండు షెడ్డులో ఉంటే ఒకటి ఆరుబయట ఏర్పాటు చేశారు. ఒకవేళ అస్తికలు కాశీ తీసుకువెళ్లడానికి భద్రపరచుకోవాలంటే అందుకు గానూ లాకరు సౌకర్యం కల్పించారు. కైలాసరథం ఇస్తామని కొందర దాతలు హామీనిచ్చారు. అది కూడా త్వరలో వస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

సమస్యలు ఇవే

ఈ కైలాస వనానికి 100 మీటర్ల దూరంలోనే పుష్కరఘాట్ ఉంది. ఇక్కడ అంత్యక్రియలు పూర్తయిన తరువాత పుష్కరఘాట్ వద్దకు వెళ్లి స్నానాలు చేయాలి. ఈ ప్రదేశంలో గోదావరి ఒడ్డు కోతకు గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇక్కడ ఒడ్డు కోతకు గురికాకుండా గ్రోయిన్స్ కట్టాలని, ఆ గ్రోయిన్స్ మీదుగా కైలాస వనం నుంచి పుష్కర ఘాట్ వరకు 100 మీటర్ల రోడ్డు నిర్మాణం చేయాలని పంచ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లక్ష్మీపాలెం వద్ద కైలాసవనంలోని ప్రధాన షెడ్డులు



లక్ష్మీపాలెం కైలాసవనం వద్ద ఆరుబయట ఏర్పాటు చేసిన పొయ్యి



కైలాసవనానికి వెళ్లే మార్గం

నరసాపురంలో డ్రెయినేజీలు అధ్వానం



లలితాంబఘాట్ రోడ్డు వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. ఓ వైపు డయేరియా లాంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పరిస్థితి దారుణంగా ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మే నెల ముగిసిన తరువాత పట్టణంలో డ్రెయిన్స్‌లో సిల్ట్ తీత పనులు చేపట్టినా పలు ప్రాంతాల్లో ఆ ఊసే తీయలేదు. అలాగే కొన్ని ప్రాంతాల్లో సిల్ట్ తీసిన సమయంలో డ్రెయిన్స్‌పై తీసిన మూతలు తిరిగి యథాస్థానంలో పెట్టకపోవడంతో మున్సిపల్ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితి చక్కబెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్మీపాలెంలో కైలాసవనం ప్రారంభం



శ్మశానవాటిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పంచ గ్రామాల పెద్దలు

యలమంచిలి: లక్ష్మీపాలెం గ్రామంలో వశిష్ఠ గోదావరి నది ఒడ్డున సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కైలాసవనాన్ని (హిందు శ్మశానవాటిక)ను ఆదివారం ప్రారంభించారు. ఈ నిర్మాణంలో భాగస్వాములైన లక్ష్మీపాలెం, మట్లపాలెం, నారినమెరక, వడ్డిలంక, గంగడుపాలెం (పంచగ్రామాలు) ప్రజలు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా కేవలం పంచగ్రామాల్లోని దాతల సహకారం రూ.30 లక్షలతో ఈ కైలాసవనాన్ని నిర్మించారు. కేవలం పంచగ్రామాల ప్రజలే కాకుండా హిందూ సంప్రదాయం అనుసరించి దహన సంస్కారాలు చేసే వారంతా ఏ గ్రామమైనా కూడా ఈ కైలాసవనంలో దహన సంస్కారాలు చేసుకోవచ్చునని నిర్మాణకర్తలు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

భీమవరం అర్బన్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూరల్ ఇన్‌చార్జి ఎస్సై ఐ.వీర్రాజు సిబ్బందితో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దిరుసుమర్రులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2 వేల 350 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్‌క్లబ్‌లో గత మూడురోజులుగా సాగుతున్న భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్ 2కే24 కార్యక్రమం ఆదివారం ముగిసింది. సంఘం నియోజకవర్గ కన్వీనర్ పి.వాసు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని చెప్పారు. ఇటీవల కాలంలో యువత చెడువ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్ లాంటి విష సంస్కృతుల జోలికి వెళ్లకూడదని సూచించారు. అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రామ్, ఫెస్ట్ కో–కన్వీనర్ ఎండీ జాన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి



బాలికలు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి విజయదుర్గ

మొగల్తూరు: ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థినులకు ఆహారం అందించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ ఆదేశించారు. ఆదివారం మొగల్తూరులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని విజయదుర్గ, బాలుర వసతి గృహాన్ని అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్‌లు సందర్శించారు. అనంతరం సీతారామపురంలోని మిషన్ ఆఫ్ హోప్ చిల్డ్రన్ హోమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వసతి గృహంలోని వంట గదులు, బాత్‌రూమ్‌లు, పడక గదులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ఆహారం అందించాలని, పరసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వసతి గృహంలోని విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాత్ రూమ్‌లు, వంట గదులు, అపరిశుభ్రంగా ఉండడం, పడక గదులు ఇరుగ్గా ఉండడం, మురుగు నీరు పారే సౌకర్యం సరిగ్గా లేకపోవడాన్ని గుర్తించారు. హస్టల్‌లో ఉండే విద్యార్థులపై మానవతా ధృక్పథంతో వ్యవహరించాలని వార్డెన్‌లకు సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జి.వాసు, లీగల్ సర్వీసస్ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, కె.కరుణ్‌కుమార్, వార్డెన్లు కె.ధారవేని, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

మొగల్తూరు: రైతులు తాము పండించిన పంటకు సంబంధించిన వివరాలను సోమవారరం నాటికి తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలోని రెండో సచివాలయ పరిధిలోని నాట్లు వేసిన వ్యవసాయ భూములను ఆదివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది ఇప్పటికే సాగు చేపట్టడం ఆలస్యమైందని, నాట్లు వేసుకోవడం పూర్తి చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీలో నమోదు చేసుకోవాలని సూచించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున చేలల్లో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూడాలని రైతులకు సూచించారు. చేలకు తెగుళ్ల సోకితే వ్యవసాయాధికారులను సంప్రదించాలని వారి సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పెన్మత్స సుబ్బరాజు, రాయపరాజు, ఏఓ అబ్దుల రహీమ్, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ కావ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు అందిస్తున్న కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్య, వైద్య సహాయం అందించడంలో యునైటెడ్ కాపు క్లబ్ తమ వంతు సహాయసహకారాలు అందిస్తుందని క్లబ్ అధ్యక్షుడు జక్కంపూడి మదన్ అన్నారు. ఆదివారం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన నామన హారికకు విద్యాభ్యాసం నిమిత్తం రూ.10 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా మదన్ మాట్లాడుతూ విద్యపై మక్కువ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో విద్యను మధ్యలో నిలుపుదల చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, ట్రెజరర్ శిరిగినీడి నాగార్జున, కానూరి ప్రభాకర్, మంగిన సాయి, కటారి నాగు తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగ సమస్యలపై అవగాహన



పాలకొల్లు అర్బన్: శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డా. ఆర్ రవికాంత్



పెనుమంట్ర: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



పెనుమంట్ర: తేతలిలో రోగులకు పరీక్షిస్తున్న ఆక్యూపంక్చర్ వైద్య నిపుణులు

పాలకొల్లు అర్బన్: హృద్రోగ సమస్యల పట్ల అలసత్వం వహించకూడదని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలని ప్రముఖ హృద్రోగ నిపుణులు ఆర్.రవికాంత్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ ఆవరణలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుండె పరీక్షల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికాంత్ పాల్గొని రోగులను పరీక్షించి సలహాలు అందజేశారు. సుగర్, బీపీ ఉన్న రోగులు కచ్చితంగా ఆహార నియమంతో పాటు క్రమ తప్పకుండా మందులు వాడాలని, అలాగే ప్రతి రోజూ ఉదయం అరగంట సేపు నడవాలని సూచించారు. సుమారు 120 మందిని పరీక్షించారు. విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత కొమ్ముల మురళి ఆధ్వర్యంలో బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్, కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, క్లబ్ సభ్యులు డాక్టర్ వి.గంగాధరరావు, కావలి నగేస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట ఆంధ్ర అసోసియేషన్ యూకే జూనియర్ కళాశాల, ద్వారంపూడి సుబ్బారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆక్యుపంచరీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీకంటి ఆసుపత్రికి ప్రముఖ డాక్టర్ పెనుమచ్చ కృష్ణ చైతన్య, డాక్టర్ పెనుమచ్చ సూర్య సోమిత్, అక్కుపంచరి నిపుణురాలు డాక్టర్ తేతలి లేఖ్యలు 150 పైగా రోగులను పరీక్షించి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కళాశాల పాలకవర్గం అధ్యక్షులు కమలంపూడి రామారెడ్డి, సెక్రెటరీ కరస్పాండెంట్ తేతలగు రెడ్డి, ప్రిన్సిపల్ ప్రకాష్ కళాశాల సిబ్బంది పాల్గొని రోగులకు సేవలు అందజేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పాలకోడేరు: మాతృ దేశానికి సేవ చేయాలనే తలంపుతో మారుమూల గ్రామీణ ప్రాంతమైన కోరుకొల్లును దత్తత తీసుకొని ప్రజలకు వైద్య సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నారని మంతెన ప్రహ్లాదరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగీంద్ర కుమార్ బాబు అన్నారు. గ్లోబల్ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా పౌండర్ డాక్టర్ భూపతిరాజు పెండేటి బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రితో మంతెన వెంకట ప్రహ్లాదరాజు ట్రస్ట్ చైర్మన్ మంతెన బాబు ఆధ్వర్యంలో ఆదివారం కోరుకొల్లులో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చేకూరి చంటిరాజు, పెదచంటి, చేకూరి సాంబమూర్తి రాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



మార్టేరులో డాక్టర్ ఆదినారాయణ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న మానవత సభ్యులు

పెనుమంట్ర: పర్యావరణ పరిరక్షణకు ఏ సహాయాన్నైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని శర్వాన్ ఫిజియోథెరపీ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి అలేఖ్య అన్నారు ఆదివారం మార్టేరులో జరిగిన పెనుమంట్ర మండల మానవతా సంస్థ సర్వసభ్య సమావేశం ముఖ్య అతిథిగా పాల్గొన్న అలేఖ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాకు లేని భాగ్యం, గోదావరి జిల్లాలకు ఉందని, ఈ జిల్లాల వాసులు చేసుకున్న అదృష్టమని తెలిపారు. అయితే నేడు నదీ జలాలు పంట కాలువలు కలుషితం కావడం దురదృష్టకరమన్నారు. ప్రతి ఒక్కరిపై ఉందన్నారు కర్రి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక పేద విద్యార్థికి మానవత తరపున రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని డాక్టర్ రెడ్డి అందజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్త సత్యనారాయణమూర్తి, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు మండలి చైర్మన్, కడలి సుబ్రహ్మణ్యం, కో చైర్మన్ పడాల జగన్నాథ రెడ్డి పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే

ఉండి: యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం ఆదివారం మండలంలోని మహదేవపట్నంలోని ఉత్తరపాలెంలో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కేఏ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వేలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే జ్వర పీడితులను గుర్తించి, వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎ.పెద్దిరాజు, ఎంఎల్‌హెచ్‌పీ డీవీవీ సుబ్బలక్ష్మి, ఏఎన్ఎం టి.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా విశ్వనాథం గురునాగ దుర్గారావు, ఎం.కుమార్‌బాబు ఎన్నికయ్యారు. ఆదివారం భీమవరంలో నిర్వహించిన సంఘం ఎన్నికల్లో వారితోపాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు తెలిపారు.

ఊరూవాడా నిమజ్జనోత్సవ సందడి



20 రోజులకు పైగా పూజలందుకుంటున్న గణనాథులు



పెనుగొండలో ఆకట్టుకున్న భారీ బుట్టబొమ్మల విన్యాసాలు



పెనుగొండ నిమజ్జనంలో ఆకట్టుకున్న ఏనుగుల రథం

పెనుగొండ: పెనుగొండలో ఆదివారం నిర్వహించిన గణపతి నిమజ్జనోత్సవం ఆకట్టుకొంది. పెనుగొండలో జవ్వాది వారి వీధి, కంబాల వారివీధి గణపతి నిమజ్జనాలు సంయుక్తంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పరిసర ప్రాంతాల్లో నిమజ్జనోత్సవాలు అన్నీ ముగిసిన అనంతరం చివరిగా వీరు నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. దేవతామూర్తుల వేషధారణలు, భారీ బుట్టబొమ్మల నృత్యాలు, ఇతర జిల్లాల నుంచి తీసుకు వచ్చిన బ్యాండ్ పార్టీలు, బాణసంచాల కాల్పులతో హోరెత్తించారు. తొలుత ఉదయం నిమజ్జనోత్సవం మీమాంసలో పడింది. మాజీ శాసన సభ్యుడు చినబాబు తనయుడు లక్ష్మయ్య నాయుడు తీవ్ర అస్వస్థకు గురికావడంతో సంబరం నిర్వహణపై వెనుకంజ వేశారు. ఈ తరుణంలో రాజమండ్రి ఆసుపత్రికి మెరుగైన చికిత్సకు తరలించడంతో నిమజ్జనోత్సవం ప్రారంభించారు. గ్రామోత్సవం అనంతరం నరసాపురం కాలువలో భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు.